క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశం నేడు

ఉదయగిరి : వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకుల ఆత్మీయ సమావేశం మర్రిపాడు మండలంలోని బ్రాహ్మణపల్లిలో గురువారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని నియోజకవర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన పార్టీ నేతలు, కార్యకర్తలు, హాజరు కావాలని కోరారు. భవిష్యత్తులో పార్టీ చేపట్టే వివిధ కార్యక్రమాలపై సమీక్ష, ప్రస్తుత పార్టీ పరిస్థితి, చేపట్టాల్సిన కార్యక్రమాలు, తదితర అంశాలపై చర్చించనున్నట్లు వివరించారు.

తరలిరండి

వరికుంటపాడు : ఉదయగిరి నియోజకవర్గ సమావేశానికి మండల నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని మండల కన్వీనర్ మందలపు తిరుపతినాయుడు బుధవారం కోరారు. నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డితో పాటు యువనేత మేకపాటి అభినవ్‌రెడ్డి హాజరవుతారన్నారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు



జలదంకి : సంక్రాంతి పండగ సందర్భంగా స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద రెడ్‌క్రాస్ సొసైటీ కావలి వారి సహకారంతో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఐకేర్ మిషన్, జలదంకి జెమ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో 24 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఐకేర్ మిషన్ అధ్యక్షుడు వడ్డే శ్రీనాథ్‌రెడ్డి, మండల రెడ్‌క్రాస్ కోశాధికారి పువ్వాడి సురేష్‌కుమార్, నిర్వాహకులు వల్లంరెడ్డి బాబుల్‌రెడ్డి, వల్లంరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, రామాల శ్రీకాంత్‌రెడ్డి, పులుగుంట మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

• **మర్రిపాడు :** మండలంలోని తిక్కవరం ఎంపీయూపీ పాఠశాలలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎంపీపీ గంగవరపు లక్ష్మీ శ్రీనివాసులునాయుడు, ఎస్సై శ్రీనివాసరావు, వైద్యాధికారి గోపీనాథ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

సంగం : ఆగి ఉన్న కారును వెనుక నుంచి మోటారు బైక్ ఢీకొని ఓ యువకుడు గాయపడిన ఘటన మండలంలోని కోలగట్ల వద్ద జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. ఆత్మకూరు వైపు నుంచి సంగం వైపు వస్తున్న కారు కోలగట్ల వద్ద రోడ్డు పక్కన ఆగింది. దీనిని గమనించని ఆత్మకూరు నుంచి సంగం వైపు వెళ్తున్న బైక్ వేగంగా కారును ఢీకొంది. దీంతో బైక్ నడుపుతున్న యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

డీఆర్‌కు ఘన నివాళి



కావలి : జవహర్ భారతి, విశ్వోదయ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ దొడ్ల రామచంద్రారెడ్డి వర్ధంతి బుధవారం కావలిలో జరిగింది. స్థానిక జవహర్ భారతి డిగ్రీ కళాశాలలో ఆయన విగ్రహం వద్ద పలువురు నివాళులర్పించారు. ఈ సందర్భంగా విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి విద్య ఒక్కటే మార్గమని నమ్మి ఆచరించి చూపించిన వ్యక్తి డీఆర్ అని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పి.సుబ్రహ్మణ్యం నాయుడు, స్వయం ఉపాధి కోర్సుల సంచాలకుడు మాల్యాద్రి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

ఆత్మకూరు : మండలంలోని నల్లపురెడ్డిపల్లి గ్రామ శివారు పొలాల్లో నిర్వహిస్తున్న కోడి పందెం స్థావరంపై ఎస్సై జిలానీ బుధవారం దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. రూ.1,050ల నగదు, రెండు కోళ్లను స్వాధీనం చేసుకున్నారు.

హెల్మెట్‌ధారణ తప్పనిసరి



మాట్లాడుతున్న పోలీసులు

బుచ్చిరెడ్డిపాళెం: ద్విచక్రవాహనదారులు హెల్మెట్లను విధిగా ధరించాలని సీఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్సై సంతోష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాలను పురస్కరించుకొని దామరమడుగులో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో వీరు మాట్లాడారు. మద్యం సేవించి వాహనాలను నడిపితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.



జలదంకిలో ముగ్గుల పోటీలు



వరికుంటపాడు : గోవులకు పూజలు



ఉదయగిరిలో బహుమతుల ప్రదానం

ఆనందోత్సాహాలతో సంక్రాంతి

గ్రామం, పట్టణం అనే తేడా లేకుండా ప్రజలు ఆనందోత్సాహాలతో సంక్రాంతి, కనుమ పర్వదిన వేడుకలను మంగళ, బుధవారాల్లో జరుపుకున్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని ఆలయాలు ప్రత్యేకంగా ముస్తాబయ్యాయి. భక్తులు విశేషంగా తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గతించిన కుటుంబ పెద్దలను స్మరించుకుని పూజలు చేశారు.

• గ్రామాల్లో సందడే సందడి
• ఆలయాలకు పోటెత్తిన భక్తులు



ఆత్మకూరు : కొండమీద కాలభైరవుడి విగ్రహం వద్ద భక్తుల పూజలు



చేజర్ల : ఎస్‌కండ్రికలో బహుమతుల ప్రదానం



వరికుంటపాడు : పెద్దిరెడ్డిపల్లిలో ప్రత్యేకాలంకరణలో నాగారపప్పమ్మ

ఆత్మకూరు : పట్టణంలోని పలు ఆలయాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. సంక్రాంతి రోజున తమ పెద్దల పేరుతో వస్త్రాలు పెట్టుకోవడం, వారికి ఇష్టమైన పదార్థాలను పంచడం లాంటివి ఇళ్ల వద్ద జరుపుకున్నారు. అనంతరం ఆలయాలకు చేరుకొని పూజలు చేశారు. కాగా పట్టణంలోని కాశీనాయన ఆశ్రమంలో భక్తుల తాకిడి నెలకొంది. కొండమీద కాలభైరవుడి విగ్రహం వద్ద పూజలు గావించారు. భారీస్థాయిలో అన్నప్రసాద వితరణ జరిగింది.

• **చేజర్ల :** మండలంలోని ఎస్‌కండ్రిక(నూతక్కివారి కండ్రిక)లో ముగ్గుల పోటీలు, క్రికెట్, కబడ్డీ, ట్రాక్టర్‌ను తాడుతో లాగుట తదితర పోటీలు బుధవారం నిర్వహించారు. విజేతలకు గ్రామ పెద్దలు తేళ్ల శేఖర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి బహుమతులు అందజేశారు

• **వరికుంటపాడు :** మండలంలోని కాంచెరువు గ్రామంలో సంక్రాంతి సంబరాల సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బీజేపీ నేత ముడమాల రమేష్‌రెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఆవులు రోశయ్య యాదవ్, మేకపాటి మాల్యాద్రి నాయుడు, గుంటుపల్లి నాగభూషణం పాల్గొన్నారు.

• **ఆత్మకూరురూరల్ :** మండల పరిధిలోని గ్రామాల్లో సంక్రాంతి కోలాహలం నెలకొంది. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులు, యువతీ, యువకుల కేరింతలతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

• **ఉదయగిరి :** ఉదయగిరి, వింజమూరు మండలాల్లో సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కనుమ రోజు పశువులను పూజించి పొలాల్లో దిష్టి బొమ్మలు ఏర్పాటు చేశారు. కాగా పలు గ్రామాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

• **వరికుంటపాడు :** మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి శోభ నెలకొంది. కనుమ రోజున గోవులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దిరెడ్డిపల్లిలోని నాగారపప్పమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పొలాల్లో పంటలకు దిష్టి దోషం తగలకుండా సీత కుండలు ఏర్పాటు చేశారు. వలస వాసుల రాకతో గ్రామాల్లో పండగ వాతావరణం సంతరించుకుంది.

• **ఆత్మకూరు :** సంక్రాంతిని పురస్కరించుకుని మున్సిపల్ పరిధిలోని టిడ్కో భవనాల వద్ద బుధవారం సాయంత్రం ముగ్గుల పోటీలు నిర్వహించారు. పులిమి శైలజారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో సుమారు 80 మందికిపైగా మహిళలు, పురుషులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

• **జలదంకి :** మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం ప్రజలు సంక్రాంతి వేడుకలను జరుపుకున్నారు. పలు గ్రామాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు.



ఆత్మకూరు: కాశీనాయన ఆశ్రమంలో..



ఆత్మకూరు : టిడ్కో భవనాల వద్ద..



ఆత్మకూరు రూరల్: ఆకట్టుకునేలా రథం ముగ్గు



వరికుంటపాడు : కాంచెరువులో..

గ్రామాల్లో క్రీడా పోటీలు



జలదంకి : కబడ్డీ పోటీలో తలపడుతున్న యువకులు

ఆత్మకూరురూరల్ : మండలంలోని ప్రతి గ్రామంలో క్రికెట్, వాలీబాల్ తదితర క్రీడా పోటీలు మంగళ, బుధవారాల్లో నిర్వహించారు. సాతానుపల్లిలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతలకు కరటంపాడుకు చెందిన వేమన సంస్థానం వారసుడు వేమన రామచంద్రప్పనాయుడు, టీడీపీ నేత మురళీ కన్నబాబు బహుమతులు అందజేశారు. సర్పంచ్ పూనుగుంట రేవతి, దావా పెంచలరావు తదితరులు పాల్గొన్నారు.

• మండలంలోని మహిమలూరులో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించగా విజేతలకు స్థానిక నాయకుడు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. దీంతో పాటు గండ్లవేడు, బోయలచిరివెళ్ల, రామస్వామిపల్లి తదితర గ్రామాల్లో జరిగిన క్రీడల్లో యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

• **జలదంకి :** మండల కేంద్రమైన జలదంకి హైస్కూల్లో మండల స్థాయి కబడ్డీ పోటీలు మంగళవారం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. అంతేకాకుండా పలు గ్రామాల్లో యువత క్రికెట్, కబడ్డీ, ట్రాక్టర్ రివర్స్, సైక్లింగ్ పోటీలు ఘనంగా నిర్వహించారు.



ఆత్మకూరురూరల్ : సాతానుపల్లిలో..



ఆత్మకూరురూరల్ : మహిమలూరులో..

ఆకట్టుకున్న ఎడ్ల బండలాగుడు పోటీలు



సోమశిల : అనంతసాగరం మండలంలోని పడమటి కంభంపాడు, కమ్మవారిపల్లి గ్రామదేవత శ్రీధర్మ పల్లెమ్మ బ్రహ్మోత్సవాల సందర్భంగా రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు బుధవారం హోరాహోరీగా జరిగాయి. దీనిని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. కాగా పోటీల్లో మొదటి స్థానంలో వైఎస్సార్ కడప జిల్లా, గొల్లపల్లికి చెందిన రామచరణ్ వీఆర్సీ బుల్స్ నిలువగా, రెండో స్థానంలో వైఎస్సార్ కడప జిల్లా నాగయపల్లికి చెందిన వేమారెడ్డి ఎడ్లు, మూడో స్థానంలో కడప జిల్లా, కాదర్‌టౌన్ కొట్బాలు, డి.భావన ఎడ్లు, నాలుగో స్థానంలో మైదుకూరుకు చెందిన డి.భావన ఎడ్లు నిలిచాయి. ఈ సందర్భంగా కార్యనిర్వాహకులు వెంకటరమణయ్య, దియ్యాల రమేష్ మాట్లాడుతూ ఏటా సంక్రాంతి పండగ రోజున అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహిస్తామని, కనుమ రోజున ఎడ్ల బండలాగుడు ప్రదర్శనలు నిర్వహిస్తామని తెలియజేశారు. అనంతరం విజేతలకు ఆత్మకూరు సీఐ గంగాధర్, ఎస్సైలు సూర్యప్రకాశ్‌రెడ్డి, శ్రీనివాసులు, జిలానీ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

పేదలకు దుస్తుల పంపిణీ



సోమశిల : లింగంగుంట గ్రామంలో..

సోమశిల : అనంతసాగరం మండల పరిధిలోని లింగంగుంట గ్రామంలో మాజీ డీసీసీబీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి బుధవారం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. అంతేకాకుండా నగదు కూడా అందించారు. కార్యక్రమంలో మెట్టుకూరు భాస్కర్‌రెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

• **వరికుంటపాడు :** మండలంలోని తోటల చెరువుపల్లె గ్రామంలో పేద మహిళలకు మంగళవారం చీరలు పంపిణీ చేశారు. ముల్లంగి కనకమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారుడు, వైఎస్సార్‌సీపీ నేత శ్రీను సంక్రాంతి పర్వదినం సందర్భంగా అందజేశారు. సర్పంచ్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.



వరికుంటపాడు : తోటల చెరువుపల్లి గ్రామంలో..



అల్లూరు గ్రామంలో..

• **అల్లూరు :** సంక్రాంతి సందర్భంగా మండల కేంద్రమైన అల్లూరులో కేఎస్సార్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కందల రాజారెడ్డి, సతీమణి మంజు భార్గవి ఆధ్వర్యంలో బుధవారం 200 మంది పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఫౌండేషన్ సభ్యులు జోసఫ్, కమల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కడుపు మండుతోంది

భగభగ మండే కొలిమి.. ఎర్రగా కాలే ఇనుము... బరువైన సుత్తులు.. శానాలతోనే వారి జీవన పోరాటం సాగుతుంది. కష్టమంటే భయపడరు.. ప్రమాదాలను లెక్కచేయరు.. నిరంతరం వ్యవసాయ పరికరాలను తీర్చిదిద్దడమే వారి దినచర్య. అయితే గతంతో పోల్చుకుంటే కడుపు నింపలేని స్థితిలో వారి కులవృత్తి ఉంది.

• దుర్భరంగా కుమ్మరుల జీవనం
• కడుపు నింపని కులవృత్తి
• యాంత్రీకరణతో ఇబ్బందులు



కొలిమి పనులు చేస్తున్న కుమ్మరులు

జలదంకి : తరతరాలుగా వ్యవసాయానికి వెన్నెముకగా నిలుస్తున్న కుమ్మరులకు ఇటీవలి కాలంలో యాంత్రీకరణ వారిపాలిట శాపంగా మారింది. కళ్ల ముందు కొలిమి భగభగ మండుతున్నా కడుపు మాత్రం నిండడం లేదని వారు వాపోతున్నారు.

నియోజకవర్గంలో..

ఉదయగిరి నియోజకవర్గంలో దాదాపు 1,300 కుటుంబాలు కమ్మరి వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నాయి. కమ్మరులు వ్యవసాయానికి అవసరమైన నాగళ్లు, కొడవళ్లు, చెలగపారలు, గొర్రు, పళ్లమాను వంటి పనిముట్లతో పాటు కత్తులు, గొడ్డళ్లను తయారు చేస్తుంటారు. కుటుంబంలోని వారందరూ కలిస్తేనే ఈ పనులు సాధ్యమవుతాయి. అప్పట్లో వ్యవసాయ పనులు జోరుగా జరిగే సమయంలో వీరికి ఆదాయం ఉండేది. ప్రస్తుతం వ్యవసాయంలో యంత్రాల వినియోగం ఎక్కువ కావడంతో వీరి జీవనోపాధికి అవరోధాలు ఏర్పడుతున్నాయి.

మెషీన్లతో ఆటంకం

కత్తులు, కొడవళ్లు లాంటి పరికరాలను మెషీన్ల ద్వారా తయారు చేసి మార్కెట్లో అమ్ముతుండడంతో వీరి వృత్తికి ఆటంకం ఏర్పడుతోంది. పనులు తగ్గిపోయి ప్రతిరోజు పూట గడవడం కష్టమవుతోందని వారు వాపోతున్నారు. అందరికీ అన్నం పెట్టే అన్నదాతలకు పనిముట్లు తయారు చేస్తూ ఆనందాన్ని పొందుతున్నామని అంటున్నారు. ఎన్ని కుల వృత్తులు కాలగర్భంలో కలిసిపోయినా తమ వృత్తి మాత్రం భూమి ఉన్నంత వరకు ఉంటుందని నమ్మకంగా చెబుతున్నారు. అయితే రోజంతా భగభగ మండే కొలిమి వద్ద కష్టించినా కడుపు నిండేంత సంపాదన లేకపోవడం బాధ కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు, పాలకులు వీరి అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుని జీవనోపాధికి భరోసా కల్పించాల్సిన అవసరం ఉంది.

గిట్టుబాటు కావడం లేదు



రోజంతా కష్టపడినా రూ.500 కూడా గిట్టుబాటు కావడం లేదు. ఈ వృత్తినే కుటుంబంలోని అందరం నమ్మకం పెట్టుకుని చేస్తున్నా కడుపు నిండడం లేదు. కులవృత్తిని వదల్లేక ఇతర వృత్తుల వైపు వెళ్లలేకపోతున్నాం. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి.

– బి.వెంకయ్య, జలదంకి

రుణాలివ్వాలి



రోజూ ప్రమాదాలతో జీవన పోరాటం చేస్తున్న కమ్మరులకు ప్రభుత్వం ప్రత్యేక రుణాలు మంజూరు చేయాలి. ప్రస్తుతం యాంత్రీకరణ వల్ల రైతులు కత్తులు, కొడవళ్లను మార్కెట్లో కొనుక్కుంటున్నారు. గతంలో కోతల సమయంలో కొడవళ్లు తయారు చేయించుకునేవారు. ప్రస్తుతం మెషీన్లు రావడంతో పనులు తగ్గాయి. అప్పుడప్పుడు వచ్చి పరికరాలు తయారు చేయించుకుంటున్నారు.

– ఇంద్ర, జలదంకి